క్లుప్తంగా

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ



శ్రీవారికి సమర్పించేందుకు పట్టు వస్త్రాలను తీసుకుని వస్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు శేషవస్త్రాన్ని, అభిషేక సామాగ్రిని మంగళవాయిద్యాల నడుమ ప్రదక్షిణగా తీసుకువెళ్లారు. అభిషేకాల అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో వేద పండితులు, అర్చకులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

అలరించిన సాయి గానామృతం



గానం చేస్తున్న బృందం

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు నిడిగట్టు పరిధి రామయోగి అగ్రహారంలోని శ్రీ సద్గురు సేవాశ్రమం 14వ వార్షికోత్సవాల సందర్భంగా శ్రీ షిర్డీ సాయి మందిరంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సాయి గానామృతం భక్తులను ఆకట్టుకుంది. భక్తి సంగీత లహరి ఆకొండి వెంకట్రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఆశ్రమ వ్యవస్థాపక నిర్వాహకులు యోగా రాజు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

దుర్గాలమ్మకు మొక్కుల చెల్లింపు



ప్రత్యేక అలంకరణలో దుర్గాలమ్మ

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ 1వ వార్డులోని బొగ్గురోడ్డులో గల దుర్గాలమ్మ ఆలయానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. చిట్టివలస, చిల్లపేట, జీరుపేట, కొత్తపేట, సంతపేట తదితర గ్రామాల నుంచి భక్తులు పోటెత్తారు. అమ్మవారికి పసుపు, కుంకుమలు, మామిడి పండ్లు సమర్పించారు. వైశాఖ మాస శుక్రవారం సందర్భంగా అర్చకుడు పెంట వెంకటరమణ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొమ్మాది: జీవీఎంసీ 6వ వార్డు కొమ్మాది సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని జోన్ 3 ఈఈ పి. శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. పీహెచ్‌సీ సెంటర్, చైతన్య ఇంజినీరింగ్ కళాశాల, చైతన్య టెక్నో స్కూల్, కే1, కే2, కే3 కాలనీలు, నవోదయ స్కూల్, డీఆర్‌కే టౌన్ షిప్, అన్నంరాజునగర్, సాయిచంద్ర లేఅవుట్, గాయత్రి కాలేజీ, అష్టలక్ష్మి దేవాలయ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

రెడ్డిపల్లి ఫీడర్ పరిధిలో..

పద్మనాభం: పద్మనాభం 33/కేవీ సబ్‌స్టేషన్ రెడ్డిపల్లి ఫీడర్ నిర్వహణ పనుల కారణంగా ఫీడర్ పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని జోన్-3 ఈఈ (ఆపరేషన్స్) పోలాకి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. శేరిఖండం, రెడ్డిపల్లి, పొట్నూరు, నరసాపురం, తునివలస, చిన్నాపురం, నేరేళ్లవలస, కొయ్యపేట, భద్రయ్యపేట, సుంకరపేట గ్రామాల్లో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు గమనించాలని కోరారు.



పోలమాంబ ఇంటి అమ్మవారి పండగ జరగనున్న ఇసుక దిబ్బల్లోని ప్రాంతం



గ్రామాల్లో ఫ్లెక్సీలు, విద్యుద్దీపాల అలంకరణలు



అమ్మవార్ల పండగల సందర్భంగా గ్రామ సరిహద్దుల్లో విద్యుత్ అలంకరణల ఏర్పాటు

మత్స్యకార గ్రామాలకు పండగ కళ



చిననాగమయ్యపాలెం గ్రామం వద్ద అమ్మవార్ల ఆలయాలు

- సొంతూళ్లకు గంగపుత్రుల రాక
- అంతటా సందడే సందడి

తగరపువలస: మత్స్యకార గ్రామాలు పండగ కళను సంతరించుకున్నాయి. ఏడాదంతా ఖాళీగా ఉండే భీమిలి మండలంలోని పెదనాగమయ్యపాలెం, అన్నవరం పంచాయతీల్లో సందడి నెలకొంది. అయిదురోజుల క్రితం ఎన్నికల పండగ కూడా జరగడంతో విశాఖ ఫిషింగ్ హార్బర్‌తో పాటు ఉత్తరాదిలోని పారాదీప్, వీరావల్ దక్షిణాదిలో ట్యుటికోరన్, మంగుళూర్ ప్రాంతాలకు వలస వెళ్లిన మత్స్యకారులు గ్రామాలకు చేరుకుంటున్నారు.

దివీస్ ఫార్మా కంపెనీ వచ్చిన తరువాత భీమిలి ప్రాంతంలో మత్స్యవేట కలిసి రాకపోవడంతో ఇక్కడి మత్స్యకారులు చెరోమూల చేపలవేట సాగే ప్రాంతాలకు వలసబాట పట్టారు. సంక్రాంతి, ఎన్నికలు, మే నెలలో జరిగే గ్రామ దేవతలు, ఇంటి అమ్మవార్ల పండగలకు విధిగా వస్తుంటారు. ఈ పండగల తరువాత చివరగా రామతీర్థాలు, సింహాచలం వెళ్లి అక్కడి దైవదర్శనాలు, మొక్కులు చెల్లించుకుని తిరిగి ఉపాధిబాట పడుతుంటారు. అయిదేళ్లకోసారి జరిగే గ్రామదేవత పోలమాంబ పండగ తప్ప ప్రతి ఏటా నూకాలమ్మ, ఎల్లమ్మ, ఆదిశక్తమ్మ, భూలోకమ్మ, ఎర్నిమాంబ, దుర్గాలమ్మ, రమణ ముత్యాలమ్మలకు, గురప్ప దేవుడు పండగ చేస్తారు. అలాగే పోలమాంబ ఇంటి అమ్మవారి పండగ కూడా చేస్తారు. ఇటీవల కొన్ని పండుగలు ముగియగా ప్రస్తుతం పెదనాగమయ్యపాలెం పంచాయతీలో ఈ నెల 18 నుంచి 21 వరకు భారీ ఎత్తున పోలమాంబ పండగను బొడ్డు ఇంటి పేరుగల కుటుంబాలు నిర్వహించానికి సన్నాహాలు చేస్తున్నారు. దీంతో మత్స్యకారులంతా కుటుంబాలతో సొంత గ్రామాలకు చేరుకుంటున్నారు. రూ.కోటి పండుగగా పిలుచుకునే ఇందులో భారీ ఎత్తున కార్యక్రమాలు, బాణసంచా, నేలవేషాలు, సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన జరుగనుంది. ఇటీవల పోలింగ్ జరిగి కౌంటింగ్ పెండింగ్‌లో ఉన్నందున ముందస్తు చర్యగా భీమిలి పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

అందరికీ గ్రామ దేవతల పేర్లే..

మత్స్యకార గ్రామాల్లో పోలమాంబ అమ్మవారి పేరుతో మహిళలకు పోలమ్మ, పురుషులకు పోలీసు .. అలాగే ఎల్లమ్మవారి పేరును ఎల్మాజీ, ఎల్లాజీ, ఎల్లయ్యమ్మ.. ఎర్నమ్మవారి పేరును ఎర్రయ్య, ఎర్రయ్యమ్మ.. గురప్ప దేవుడి పేరును గురుమూర్తి, గురమ్మ, గురప్ప.. దుర్గాలమ్మవారి పేరును దుర్గారావు, దుర్గాప్రసాద్, దుర్గ, దుర్గాలమ్మ.. నూకాలమ్మ వారి పేరును నూకరాజు, నూకాలమ్మగా పిలుస్తారు. తరువాత స్థానంలో సింహాచలానికి చెందిన సింహాద్రి అప్పన్న, రామతీర్థాలకు చెందిన శ్రీరాముడి పేర్లను అప్పన్న, నరసింహులు, స్వామి, రాము, రాముడు, రామస్వామిగా నామకరణం చేస్తుంటారు. మిగిలిన దేవుళ్ల పేర్లు ఈ గ్రామాలలో అంతగా వినిపించవు. ఒకే పేరుతో ఎక్కువ మంది ఉంటే చిన్న, పెద్ద లేదా తండ్రి పేర్లను చేర్చి పిలుచుకుంటారు.

అందరికీ పండగే



శ్రమనే నమ్ముకుని సముద్రంపై నిత్యం వేట సాగించే మాకు మే నెల కాస్త ఆటవిడుపుగా ఉంటుంది. సొంత గ్రామంలో అందరం కలుస్తాం. ఆటపాటలతో ఉల్లాసంగా గడుపుతాం.

– కేశం దాసు

అమ్మవార్లే మాకు రక్ష



గంగమ్మతల్లి తరువాత మేము ఎక్కడ ఉన్నా కాచి కాపాడేది గ్రామదేవతలు, ఇంటి అమ్మవార్లే. అందువలన ఎక్కడ ఉన్నా పండగలు జరిగేటప్పుడు కుటుంబాలతో మా గ్రామాలకు చేరుకుంటాం. వారికి మొక్కులు చెల్లించి అప్పన్న కొండకు వెళ్తాం.

– మైలపల్లి రాము

బెంబేలెత్తిస్తున్న వీధి కుక్కలు



సంతపేటలో ఇంటి ద్వారం ముందు తిష్ట వేసిన వీధి కుక్కలు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ 1,2 వార్డులలో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఇళ్ల ముందు తిష్ట వేసి రహదారులపై రాకపోకలు సాగించే వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా ద్విచక్ర వాహనచోదలను వెంటాడుతుండటంతో వారు ప్రమాదాలకు గురవుతున్నారు. స్థానిక ప్రైవేట్ మార్కెట్‌లో పడేసే కోళ్లు, చేపల వ్యర్థాల కోసం ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన కుక్కలు మార్కెట్ చుట్టుపక్కల గ్రామాల వారికి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వీధుల్లో తిష్ట వేసిన కుక్కల్లో చాలా వాటికి చర్మ వ్యాధులు ఉండటంతో వాటి నుంచి మనుష్యులకు ఎలాంటి ముప్పు వాటిల్లుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. జీవీఎంసీ ఆధ్వర్యంలో ఇతర ప్రాంతాల్లో పట్టుకున్న కుక్కలకు శస్త్రచికిత్సలు చేసి ఇక్కడ వదిలేస్తున్నట్టు పలువురు ఆరోపిస్తున్నారు. తమకు వీధి కుక్కల బెడద వదిలించాలని భీమిలి జోన్ ప్రజలు కోరుతున్నారు.

వేధింపుల భర్తపై ఫిర్యాదు

పీఎంపాలెం: అదనపు కట్నం కోసం వేధిస్తున్నారంటూ రేవళ్లపాలేనికి చెందిన గాడు అనూష పీఎంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలివి.. అనూషకు 2020లో వంశీ కిషోర్‌తో వివాహం అయింది. వివాహ సమయంలో రూ.3 లక్షల నగదు, కేజీ వెండి, 5 తులాల బంగారు ఆభరణాలను తల్లిదండ్రులు కట్నంగా ఇచ్చారని అనూష తెలిపారు. ఇటీవల అదనంగా కట్నం తేవాలని తన భర్త సోదరుడు పృథ్వి, అత్తమామలు వేధిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు.

శిథిలమైన మంచినీటి పథకం మెట్లు



మూలకుద్దు ఎస్సీ కాలనీలో శిథిలమైన ట్యాంకు మెట్లు

తగరపువలస: భీమిలి మండలం మూలకుద్దు పంచాయతీ ఎస్సీ కాలనీలోని రక్షిత మంచినీటి పథకం మెట్లు శిథిలమయ్యాయి. దీంతో ట్యాంకు శుభ్రత పనులు జరగడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. నెలల తరబడి శుభ్రం చేయని ట్యాంకు నుంచి నీటిని వినియోగిస్తున్నందున వ్యాధులు తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్యాంకు పరిసరాలు, కింద భాగం కూడా అపరిశుభ్రంగా ఉందని వాపోయారు. గ్రామంలో 150కి పైగా కుటుంబాలు ఉన్నాయని, తాగునీటి కోసం బయటి గ్రామాలకు వెళ్లవలసి వస్తుందని అంటున్నారు. శిథిలమైన మెట్ల నుంచి పెచ్చులు ఊడి సమీపంలోని ఇళ్లలో ఉంటున్న ప్రజలపై పడుతున్నాయని చెబుతున్నారు. వారికి రక్షణగా చుట్టూ కంచె ఏర్పాటు చేయాలంటున్నారు. ఇప్పటికైనా గ్రామీణ నీటి సరఫరా విభాగం సిబ్బంది ట్యాంకును శుభ్రం చేయించి సురక్షితమైన తాగునీరు సరఫరా చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

కల్యాణం.. కమనీయం



తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ ఆస్థాన మండపంలో ఉదయం 9.30 గంటల నుంచి ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.స్వామివారి ఉత్సవమూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలలో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం,శేష వస్త్రాలు అందజేశారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు. కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

కుసులవాడలో 210 మందికి వైద్య సేవలు



కుసులవాడలో రక్తపోటు తనిఖీ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

తగరపువలస : ఆనందపురం మండలం కుసులవాడలో శుక్రవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మండల పీహెచ్‌సీకి చెందిన వైద్య ఆరోగ్య సిబ్బంది 210 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఆస్పత్రి వైద్యులు ఎం.గంగునాయుడు, షెహనాజ్ సాధియా, ప్రత్యేక వైద్యులు అఖిల, శ్రావ్య సాధారణ ప్రజలతో పాటు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు సేవలు అందించారు. ఈ సందర్భంగా గంగునాయుడు మాట్లాడుతూ ఈ సురక్ష శిబిరం ద్వారా ప్రతి ఒక్కరు క్రమం తప్పకుండా వైద్యసేవలు, పరీక్షలు పొందాలన్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు ఇవ్వనున్నట్టు తెలిపారు. ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశ్యంతో గ్రామీణుల ముంగిట్లో ఈ వైద్యసేవలను ప్రభుత్వం అందుబాటులో ఉంచిందన్నారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు సామాజిక ఆరోగ్య అధికారి పి.సాంబమూర్తి, ఆరోగ్య పర్యవేక్షకులు పార్వతమ్మ, కృష్ణమోహన్, సచివాలయ కార్యదర్శి జీవన్‌లత, క్షయ వ్యాధి సూపర్‌వైజర్లు వీరబ్రహ్మం, సురేష్ ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

చక్కటి జీవన శైలితో అదుపులో రక్తపోటు



సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్యుడు గంగునాయుడు

తగరపువలస : జీవన శైలిలో మార్పులతో రక్తపోటును అదుపులో ఉంచుకోవచ్చని ఆనందపురం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్యుడు ఎం.గంగునాయుడు తెలిపారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా శుక్రవారం కుసులవాడలో జరిగిన కార్యక్రమంలో ఆయన వైద్య ఆరోగ్య సిబ్బందితో పాటు స్థానికులను ఉద్దేశించి మాట్లాడారు. క్రమం తప్పకుండా శారీరక వ్యాయామం చేయడంతో పాటు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు చేసుకోవాలన్నారు. వయసు పైబడిన వారు తరచూ రక్తపోటు పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులు, విలేజ్ క్లినిక్‌లలో ఉచితంగా మందుల పంపిణీ, రక్తపోటు పరీక్షలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రక్తపోటు కారణంగా గుండె సంబంధిత వ్యాధులు తలెత్తుతాయన్నారు. దీనిని నివారించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరుతూ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు షెహనాజ్ సాధియా, సామాజిక ఆరోగ్య అధికారి పి.సాంబమూర్తి, ఆరోగ్య పర్యవేక్షకులు కృష్ణమోహన్, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యాకానుకలు జాగ్రత్తగా భద్రపరచాలి



మాట్లాడుతున్న ఎంఈవో రమణ

పద్మనాభం: విద్యా కానుకలు తీసుకోవడం, పంపిణీ చేయడంలో సీఆర్‌ఎంటీలు, పీటీఐలు బాధ్యతాయుతంగా పని చేయాలని ఎంఈవో పి.రమణ సూచించారు. విద్యా కానుకలపై మండల విద్యాశాఖ కార్యాలయంలో సిబ్బందితో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏడు రకాల విద్యా కానుకలు మండల స్టాక్ పాయింట్‌లకు వస్తాయన్నారు. సంబంధిత టీమ్ మెంటార్లు వీటిని రిసీవ్ చేసుకుని స్టాక్ పాయింట్‌లో భద్రపరచాలని తెలిపారు. విద్యా కానుకలు పాఠశాలలకు చేరేంత వరకు సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. సమావేశంలో సీఆర్‌ఎంటీలు, పీటీఐలు, ఐఈఆర్‌పీలు, మండల విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా పండగ జరుపుకోండి



చిననాగమయ్యపాలెంలో గ్రామపెద్దలతో సమావేశమైన భీమిలి సీఐ రమేష్, ఎస్‌ఐ హరీష్

తగరపువలస: ప్రశాంత వాతావరణంలో పండగ చేసుకోవాలని భీమిలి సీఐ డి.రమేష్, ఎస్‌ఐ గంటా రమేష్ శుక్రవారం సాయంత్రం చిననాగమయ్యపాలెం గ్రామస్తులకు సూచించారు. ఈ నెల 18 నుంచి చిననాగమయ్యపాలెంలో ఇంటి అమ్మవారి పండగ సందర్భంగా గ్రామపెద్దలతో సమావేశం అయ్యారు. గతంలో గ్రామంలో జరిగిన సంఘటనల దృష్ట్యా బయటి ప్రాంతాల నుంచి ఆకతాయిలు వచ్చే అవకాశం ఉన్నందున అలాంటి వారిని పసిగట్టి నిరోధించాలన్నారు. ముందు జాగ్రత్తగా అలాంటి వారి వివరాలు తమకు అందించి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బొడ్డు దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

భక్తుల కొంగు బంగారం ఎర్నిమాంబ

- కోరిన వరాలిచ్చే కల్పవల్లి
- నేడు అమ్మవారి తొలేళ్ల సంబరం
- ఆదివారం ప్రధాన జాతర



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు



జ్ఞానాపురంలోని ఎర్నిమాంబ ఆలయ గోపురం

కంచరపాలెం : సంతానం లేని దంపతులకు సంతాన లక్ష్మిగా, కోరిన వరాలిచ్చే కల్పవల్లిగా జ్ఞానాపురం ఎర్నిమాంబ అమ్మవారు కీర్తి గడించారు. గత వందేళ్లగా అమ్మవారి చల్లని చూపు కోసం వేలాది మంది భక్తులు తరలి వస్తున్నారు. జ్ఞానాపురం, అల్లిపురం, అచ్చియ్యమ్మపేట ప్రజల ఇలవేల్పుగా ఎర్నిమాంబ కొలువై ఉన్నారు. భక్తిశ్రద్ధలతో కొలిస్తే తమ కోరికలు నెరవేరుతాయనే నమ్మకం భక్తుల్లో ఉంది. 19 శనివారం ఎర్నిమాంబ అమ్మవారి తొలేళ్ల సంబరం. 20 ఆదివారం వైభవంగా ప్రధాన జాతర, 26 శనివారం భారీ అన్నసమారాధన, 27న మారువారం నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

అమ్మవారి ఆలయ చరిత్ర..

ఎనభై ఏళ్ల క్రితం విశాఖ కుగ్రామంగా ఉన్న నేపథ్యంలో అప్పటి భక్తులు అమ్మవారికి చిన్నగుడి నిర్మించారు. ఈ ప్రాంతంలో తుప్పలు, డొంకల మధ్య అమ్మవారు వెలసినట్టు భక్తులు చెబుతారు. పదుల సంఖ్యలోనే ఇళ్లు ఉండడంతో చీకటి పడితే జనసంచారం ఉండేది కాదు. రాత్రి వేళ ఈ మార్గంలో వెళ్లేందుకు అంతా భయపడేవారు. తర్వాత ఇక్కడ ప్రజలు నివసించటం మొదలు పెట్టడంతో ఊరు అభివృద్ధి చెందింది. ఆలయం పక్కగా జీవీఎంసీ అధికారులు రోడ్లు విస్తరించారు. గత ఇరవై ఐదేళ్లుగా అమ్మవారిని భక్తులు విశేషంగా పూజిస్తున్నారు. ఎర్నిమాంబ అమ్మవారికి తొమ్మిది మంది అక్కచెల్లెళ్లు ఉన్నట్టు పూర్వీకులు చెబుతారు. ప్రతి ఏటా మే నెల మూడో ఆదివారం నిర్వహించే ప్రధాన పండగను అద్వితీయంగా నిర్వహించడం ఆనవాయితీగా మారింది. ఆది, మంగళ, బుధ, శుక్రవారాల్లో దేవాలయం భక్తులతో కిటకిటలాడుతుంది. విశాఖ జిల్లాతో పాటు శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి, అల్లూరి, తూర్పుగోదావరి తదితర జిల్లాల నుంచి కూడా భక్తులు అమ్మవారి సందర్శనార్థం వస్తుంటారు. ఆదివారం ఆలయం వద్దే వంటా వార్పు చేసుకుని అమ్మవారి చెంతనే ప్రసాదాలు స్వీకరిస్తారు. 2007లో సంఘం సభ్యులే దేవాలయాన్ని ఎండోమెంటుకు అప్పగించారు.

మా ఇంటి ఇలవేల్పు



ఎర్నిమాంబను మా ఇంటి ఇలవేల్పుగా కొలుస్తున్నాం. అమ్మవార్ని దర్శించుకున్న తర్వాతే ఏ పనైనా చేస్తాం. భక్తిశ్రద్ధలతో పూజిస్తే అమ్మ కోరిన కోర్కెలు తప్పక తీరుస్తుంది. అమ్మవారి జాతరలో కుటుంబమంతా మొక్కులు చెల్లించుకుంటాం.

– బంటుపల్లి నూకరాజు, గురుస్వామి, పూర్ణామార్కెట్,

అమ్మ దీవెనలతో అంతా మంచే



మా తాతల కాలం నుంచి మా కుటుంబంలో అందరి పేర్లు ఎర్నిమాంబ పేరుతో కలిసే ఉంటాయి. అమ్మవారిని సంతాన లక్ష్మిగా కొలుస్తున్నాం. అమ్మ దీవెనలు ఉంటే చల్లగా ఉంటాం. అమ్మ దర్శన భాగ్యం, నిత్య పూజలతో ఎవరికైనా మంచి జరుగుతుంది. నమ్ముకున్న వాళ్లకు కొంగు బంగారంగా అమ్మ కటాక్షిస్తుంది.

– పల్లా పద్మజ, భక్తురాలు, కంచరపాలెం

మౌలిక సదుపాయాలు కల్పించాం

ఎర్నిమాంబ అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాలకు ఆలయ చైర్మన్ ఎల్. రమణ, కమిటీ సభ్యుల పర్యవేక్షణలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. శనివారం జరిగే తొలేళ్ల సంబరాలు పూర్ణామార్కెట్ దుర్గమాంబ ఆలయం నుంచి ప్రారంభం అవుతాయి. ఆదివారం జరిగే ప్రధాన జాతరకు ఆలయ పరిసరాల్లో భక్తులకు మౌలిక వసతులు కల్పించాం.

– డీవీఎస్ సురేష్‌బాబా, ఈవో, ఎర్నిమాంబ ఆలయం

ఏయూను సందర్శించిన అమెరికా ఆచార్యుడు



వీసీ ప్రసాదరెడ్డితో భేటీ అయిన అమెరికా ఆచార్యుడు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని అమెరికాలోని ఇండియానా యూనివర్సిటీ ఇండియానా పోలీస్‌కు చెందిన డాక్టర్ మంగిలాల్ అగర్వాల్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్‌లతో సమావేశమయ్యారు. బోధన, పరిశోధన భాగస్వామ్యం, సంయుక్తంగా కోర్సుల నిర్వహణ, అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించాలనే భావించే విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, పీహెచ్‌డీ, పోస్ట్ డాక్టరల్ ప్రోగ్రాం, ఆన్‌లైన్ కోర్సులను ఏయూ సిబ్‌తో పాటు ఇతర విభాగాలతో సంయుక్తంగా నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ఆచార్యులు ఆచార్య జి.గిరిజా శంకర్, ఆచార్య కె.ఈశ్వర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.